RNI APTEL/26/A4265

మీ తీర్పు

నిజం మా ధర్మం

ప్రజల పక్షమే మా స్వరం

తెలుగు జాతీయ వార పత్రిక

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ | సంపుటి 01 | సంచిక 15 | సంపాదకుడు : పూలంబేటి రాఘవేంద్రకుమార్ | 04 సెప్టెంబర్ 2026 - 10 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8 | వెల 5-00

# ఉల్లిపాయలను కేవలం రూ.32కే



**అమరావతి మీతీర్పు**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిత్యావసరాల ధరల పెరుగుదలతో ఇబ్బంది పడుతున్న సామాన్య ప్రజలకు కూటమి ప్రభుత్వం కీలక ఉపశమనం ప్రకటించింది. వంటింటి భారాన్ని తగ్గించే లక్ష్యంతో కిలో ఉల్లిపాయలను కేవలం రూ.32కే రాయితీపై అందించనున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. వచ్చే వారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 115 రైతు బజార్లు, ప్రత్యేక మొబైల్ కౌంటర్ల ద్వారా ఈ చౌక ఉల్లిపాయల విక్రయాలు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. ఉల్లితో పాటు చౌకధరల దుకాణాల (రేషన్ డిపోలు) ద్వారా రాయితీపై కందిపప్పు, పామాయిల్‌ను కూడా త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రి పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్ ధరలతో పోలిస్తే దాదాపు 30 శాతం తక్కువ ధరకే నాణ్యమైన సరుకులను అందించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని, ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నామని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో సామాన్య, మధ్యతరగతి వర్గాల కుటుంబాలపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గుతుందని భావిస్తున్నారు.

## పాలనలో పారదర్శకత భూములకు

# సంపూర్ణ భద్రత

### సీఎం చంద్రబాబు

**అమరావతి**

సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అనే మూడు సూత్రాలతో కూటమి ప్రభుత్వం ప్రజల సేవలో ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. కేవలం సచివాలయానికే పరిమితం కాకుండా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గంలోని మాచడవ పండువారిపేటలో నిర్వహించిన 'మీ భూమి - మీ హక్కు' గ్రామసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రతి నెలా మొదటి తేదీన నేరుగా ప్రజల వద్దకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అందజేస్తున్నామని, రెండవ శనివారం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర', నాలుగో శనివారం పీ4 (ప్రజలు, ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్యం) కార్యక్రమాల ద్వారా ప్రజా జీవన ప్రమాణాల పెంపునకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ప్రతి నెలా 9వ తేదీన 'మీ భూమి - మీ హక్కు' ద్వారా భూ యజమానులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని సీఎం చెప్పారు. గత ప్రభుత్వంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో ప్రజలను భయాందోళనలకు గురిచేశారని, తమ ప్రభుత్వం రాగానే ఆ చట్టాన్ని రద్దు చేసి ఊరటనిచ్చామని గుర్తుచేశారు. గతంలో రీసర్వే పేరుతో జరిగిన అవకతవకలను సరిదిద్దుతూ, భద్రత కోసం బ్లాక్ చైన్ టెక్నాలజీ, ఈ-కేవైసీ, క్యూఆర్ కోడ్ వంటి ఆధునిక ఫీచర్లతో కొత్త పాస్ పుస్తకాలను అందిస్తున్నట్లు వివరించారు.భూ సర్వే పురోగతి: రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 8,234 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి, 36 లక్షల మందికి పాస్ పుస్తకాలు అందించాం. వచ్చే ఏడాది మార్చి నాటికి మిగిలిన 8,582 గ్రామాల్లోనూ సర్వే పూర్తి చేసి, మొత్తం 56 లక్షల పాస్ పుస్తకాలు పంపిణీ చేయడమే లక్ష్యం.

16 లక్షల ఎకరాలకు విముక్తి: గతంలో అక్రమంగా 22ఏ (నిషేధిత) జాబితాలో చేర్చిన 16 లక్షల ఎకరాలను తొలగించాం.

రిజిస్ట్రేషన్ కాగానే ఆటో మ్యుటేషన్ సేవలు అందుబాటులోకి తెచ్చాం. అలాగే వారసత్వ భూముల విభజనలో స్టాంప్ డ్యూటీని రూ.1,000కి తగ్గించడం ద్వారా 1.25 లక్షల కుటుంబాలకు మేలు జరిగింది.

దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం: శెట్టిపల్లి, కంగుంది, వట్టిచెరుకూరు, ముదినేపల్లి తదితర ప్రాంతాల్లో దశాబ్దాలుగా నలుగుతున్న 244 భూ వివాదాలను శాశ్వతంగా పరిష్కరించాం. అమలాపురం, ముమ్మిడివరం, రామచంద్రాపురం ప్రాంతాల్లో 1908 నాటి బ్రిటిష్ కాలపు 22ఏ(1) సమస్యను తీర్చి, 1,410 మందికి చెందిన 56.37 ఎకరాలకు విముక్తి కల్పిస్తున్నాం.



నీటి భద్రత అభివృద్ధి పనుల ప్రారంభం

భూ రక్షణతో పాటు నీటి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పోలవరం డయాఫ్రామ్ వాల్ దెబ్బతిని ప్రాజెక్టు ఆలస్యమైందని సీఎం విమర్శించారు. 2024 తీర్పుతో కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధుల ప్రవాహం పెరిగిందన్నారు. ఈ సందర్భంగా తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) ఆధ్వర్యంలో రూ.240 కోట్ల వ్యయంతో చేపట్టనున్న గ్రిడ్ ఆధునీకరణ, 3-ఫేజ్ విద్యుత్ సరఫరా పనులకు సీఎం శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీశ్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



**ఆంధ్రప్రదేశ్ చీఫ్ సెక్రెటరీ సాయి ప్రసాద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ హాజరైన జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్**








**తిరుమల స్వామివారి కోయిలాళ్వార్ తిరుమంజనం లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ ,ఎస్పీ శ్రీ ఎల్.సుబ్బరాయుడు..**

మీ తీర్పు
నిజం మా ధర్మం
ప్రజల పక్షమే మా స్వరం

# తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలకు ఊరట

తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో చోటుచేసుకున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అరెస్టైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలకు నాంపల్లి కోర్టులో ఊరట లభించింది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు విధుల్లో ఉన్న పోలీసులతో దురుసుగా ప్రవర్తించారనే ఆరోపణలతో పోలీసులు వారిని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో అదుపులోకి తీసుకున్నారు. స్పీకర్ ఓఎస్డీ ఫిర్యాదు మేరకు సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసిన కేసుల ఆధారంగా వీరిని నాంపల్లి కోర్టులో హాజరుపరచి రిమాండ్ కోరారు.

అయితే ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం పోలీసుల రిమాండ్ అభ్యర్థనను తోసిపుచ్చింది. రూ.10 వేల చొప్పున వ్యక్తిగత పూచీకత్తుతో పాటు రెండు ష్యూరిటీలు సమర్పించాలని ఆదేశిస్తూ ఎమ్మెల్సీలను విడుదల చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మెల్సీల తరఫు న్యాయవాదులు ఇది రాజకీయ కక్షసాధింపు చర్య అని వాదించగా, నాంపల్లి కోర్టు పూచీకత్తుల సమర్పణ అనంతరం వారిని విడిచిపెట్టడానికి అనుమతించింది.

మరోవైపు ఈ ఘటనపై తెలంగాణ హైకోర్టులోనూ విచారణ కొనసాగుతోంది. ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని, వారి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి గతంలో ఇచ్చిన ఉత్తర్వులను సవరించాలని కోరుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ, బీఆర్ఎస్ నేతలు నిషేధాజ్ఞలు ఉల్లంఘించి నిరసన తెలపడమే కాకుండా విధుల్లో ఉన్న పోలీసులను నెట్టివేశారని, శాంతిభద్రతల పరిరక్షణ కోసమే స్పీకర్ ఆదేశాల మేరకు పోలీసులు వ్యవహరించారని కోర్టుకు వివరించారు.

## ‘నందు’కు నోటీసులు

యూట్యూబర్, ‘నందూస్ వరల్డ్’ ఛానల్ నిర్వాహకురాలు రమానందన అలియాస్ ‘నందు’కు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఇమిగ్రేషన్ అధికారులు అడ్డుకుని ఇబ్రహీంపట్నం పోలీసులు నోటీసులు జారీ చేశారు. యూకేలో ఉద్యోగాలు ఇప్పిస్తామని, వీసాలు రెన్యూవల్ చేయిస్తామని పలువురిని మోసగించారనే ఆరోపణలపై నందన, ఆమె భర్త మధుకర్, మామ మోహన్‌రావులపై గతేడాది నవంబర్‌లో కేసులు నమోదయ్యాయి. ఈ వ్యవహారంలో గతంలోనే లుక్ అవుట్ నోటీసులు కూడా జారీ అయ్యాయి. సోమవారం లండన్ నుంచి హైదరాబాద్ వచ్చిన నందనను శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఇమిగ్రేషన్ అధికారులు అడ్డుకుని ఇబ్రహీంపట్నం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇబ్రహీంపట్నం పోలీసులు ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని ఆమెకు 35 బీఎన్ఎస్ కింద నోటీసులు అందించారు. నమోదైన కేసులకు సంబంధించి రెండు రోజుల్లో పోలీస్ స్టేషన్‌కు వచ్చి వివరణ ఇవ్వాలని ఆ నోటీసుల్లో స్పష్టం చేశారు. నోటీసులు అందుకున్న అనంతరం ఆమె అక్కడ నుంచి వెళ్ళిపోయినట్లు పోలీసులు తెలిపారు. గుంటూరుకు చెందిన నందన సోషల్ మీడియాలో విలక్షణమైన గొంతుతో గుర్తింపు పొందడమే కాకుండా ‘మన శంకర వరప్రసాద్’ సినిమాలోనూ నటించారు.

## రెండో రోజూ నష్టాలు

**న్యూఢిల్లీ :** అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు పెరగడం, భౌగోళిక ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ జూన్ మధ్య నుంచి చూస్తే కనిష్ఠ స్థాయికి చేరాయి. బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాల షేర్లలో అమ్మకాలు మార్కెట్లపై మరింత ఒత్తిడి పెంచాయి. సెన్సెక్స్ 555.23 పాయింట్లు పతనమై 75,577.58 వద్ద ముగిసింది. నిఫ్టీ 144.05 పాయింట్లు కోల్పోయి 23,635.10 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 0.73 శాతం, నిఫ్టీ 0.61 శాతం చొప్పున నష్టపోయాయి. నిఫ్టీలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ప్రైవేట్ బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీలు ఎక్కువగా పడిపోయాయి. మరోవైపు ఫార్మా, హెల్త్‌కేర్ రంగాలు కొంత మద్దతు ఇచ్చాయి. అయితే మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు మాత్రం స్వల్ప లాభాలతో ముగిశాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.21 శాతం, స్మాల్‌క్యాప్ 0.17 శాతం చొప్పున పెరిగాయి. చమురు ధరలు ఇదే స్థాయిలో కొనసాగితే మార్కెట్‌లో ఒడుదొడుకులు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. గత ఐదు, ఆరు నెలల్లో మిడ్, స్మాల్‌క్యాప్ షేర్లు భారీగా రాణించడంతో ఇకపై వాటి జోరు కొనసాగడం కష్టమేనని అభిప్రాయపడుతున్నారు. పెద్ద కంపెనీల షేర్లు, ఈక్విటీ ఆధారితేతర ఈటీఎఫ్‌ల వైపు దృష్టి పెట్టడం సురక్షితమని సూచిస్తున్నారు. ఇదిలా ఉంటే రూపాయి విలువ కూడా బలహీనపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 0.29 శాతం క్షీణించి 94.81 వద్ద ట్రేడైంది. డాలర్ 98.95 సమీపంలో ఉండగా.. బ్రెంట్ క్రూడ్ ధర 97 డాలర్ల వద్ద కొనసాగింది.

.

# రూ.10వేల కోట్లతో రైల్వే మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు

- కేంద్ర కేబినెట్ ఆమోదం
- తెలుగు రాష్ట్రాలకు లబ్ధి
- వివరాలు వెల్లడించిన రైల్వేశాఖమంత్రి



**న్యూఢిల్లీ**

దేశవ్యాప్తంగా రైల్వే నెట్‌వర్క్ సామర్థ్యాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం రూ. 10,021 కోట్ల అంచనా వ్యయంతో కీలక మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు ఆమోదముద్ర వేసింది. ఈ వివరాలను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. పీఎం గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ ఆధారంగా రూపొందించిన ఈ ప్రాజెక్టులు 2029–30 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

దక్షిణాదిలో 5, ఉత్తరాదిలో 3తో కలిపి మొత్తం 7 రైల్వే కారిడార్లలో 4 లేన్ల/మల్టీ ట్రాకింగ్ నిర్మాణాలు చేపట్టనున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని 17 జిల్లాల పరిధిలోని 4,790 గ్రామాలకు ఈ ప్రాజెక్టుల ద్వారా మెరుగైన రవాణా సదుపాయం కలగనుంది.

ఘట్‌కేసర్ – కాజీపేట (తెలంగాణ): 110 కిలోమీటర్ల మేర రూ. 2,419 కోట్లతో 4వ లైన్ నిర్మాణానికి ఆమోదం.

అరక్కోణం – రేణిగుంట (ఏపీ – తమిళనాడు): 77 కిలోమీటర్ల పరిధిలో 3, 4వ లైన్ల నిర్మాణం.

ఇతర మార్గాలు: వైట్‌ఫీల్డ్ – బంగారుపేట (47 కి.మీ 3, 4వ లైన్లు), సేలం – కరూర్ – దిండిగల్ (159 కి.మీ డబ్లింగ్), హోసూర్ – ఒమలూరు (147 కి.మీ డబ్లింగ్).

పర్యాటకం ఆర్థిక ప్రయోజనాలు

ఈ కొత్త రైలు మార్గాల వల్ల జగన్నాథ ఆలయం, తారాతరిణి ఆలయం, బంధవ్‌గఢ్ టైగర్ రిజర్వ్, అమర్‌కంటక్, అచానక్‌మార్ టైగర్ రిజర్వ్ వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలకు కనెక్టివిటీ పెరుగుతుంది. సరుకు రవాణాలో ముఖ్యంగా బొగ్గు, సిమెంట్, ఇనుము, ఉక్కు రవాణా సులువవుతుంది.

సరుకు రవాణా: ఏడాదికి అదనంగా 47 మిలియన్ టన్నుల సరుకు రవాణా సామర్థ్యం పెరుగుతుంది.

పర్యావరణ మేలు: సుమారు 12 కోట్ల లీటర్ల ఇంధన దిగుమతి ఆదాతో పాటు, 62 కోట్ల కిలోల కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాలు తగ్గుతాయి.

దేశంలో అత్యంత వేగవంతమైన బుల్లెట్ రైలు ప్రారంభోత్సవాన్ని 2027లో నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. దీనికి సంబంధించిన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకోగా, వచ్చే ఏడాది మే-జూన్ నాటికి ట్రయల్ రన్స్ ప్రారంభం కానున్నాయి.

# అక్రమాలను అరికట్టాల్సిన అధికారులే. వసూళ్ల దందా

**రవాణా శాఖ అధికారిపై ఏసీబీ ఆకస్మిక తనిఖీలు**

**పట్టుబడిన రూ. 2.48 లక్షలు నగదు స్వాధీనం...**

**కావలి (మీ తీర్పు ):**

వాహనదారులు చెమటోడ్చి సంపాదించిన ప్రతి రూపాయికి విలువ ఉంది. ఆ సంపాదన పై అక్రమంగా చేయి పడకుండా చూడటం కూడా ప్రజాస్వామ్య వ్యవస్థ బాధ్యతే...

పగలనక.. రేయనక రహదారులపై వాహనాలు నడుపుతూ వచ్చిన కొద్దిపాటి ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకునే డ్రైవర్లపైనే....ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగాలు చేస్తున్న అధికారులే అక్రమంగా.. అన్యాయంగా వసూలు దందా కొనసాగిస్తున్న సంఘటన కావలి మండల పరిధిలోని ముసునూరు టోల్ ప్లాజా వద్ద ఆదివారం చోటుచేసుకుంది.



గోపి నాయకులు విచారిస్తున్న ఏసీబీ అధికారులు






జాతీయ రహదారిలో వాహన డ్రైవర్ల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న రవాణా శాఖకు ఎన్ ఫోర్స్ మెంట్ అధికారి గోపినాయక్ ను నెల్లూరు అవినీతి నిరోధక శాఖ అధికారులు అరికట్టారు. రాత్రి 11 గంటల సమయంలో జాతీయ రహదారిలో కావలి ముసునూరు టోల్ ప్లాజా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి పై ఏసీబీ డిఎస్పి రామకృష్ణుడుఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వాహన డ్రైవర్ల నుండి అక్రమంగా నగదు వసూలు చేస్తున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. అతని వద్ద వాహనాలకు వేసిన జరిమానా రుసుము కంటే అదనంగా రూ. 2.48 లక్షల రూపాయలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిసింది. గుర్తించిన అంశాలు ఎంత డబ్బులు పట్టుకున్నారు అనే విషయాలపై విచారణ కొనసాగుతుందని పూర్తి వివరాలు తెలియజేస్తామని ఏసిబి డిఎస్పి రామకృష్ణుడు తెలిపారు.

రోడ్డు భద్రత, వాహనాలు ఫిట్నెస్, పత్రాలు తనిఖీలు, నిబంధనల అమలు విషయంలో రవాణా శాఖ అధికారులకు కీలక బాధ్యత ఉంది. నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం తప్పనిసరి. కానీ దీనికి భిన్నంగా ఈ అక్రమ వసూళ్ల దందా జరుగుతుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మీ తీర్పు
నిజం మా ధర్మం
ప్రజల పక్షమే మా స్వరం

# రాజ్యసభ 'హౌస్ కమిటీ' సభ్యుడిగా : బిఎంఆర్



**కావలి (మీ తీర్పు ) :** రాజ్యసభ సభ్యులు డాక్టర్ బీద మస్తాన్ రావు రాజ్యసభ ప్రతిష్టాత్మకమైన హౌస్ కమిటీ సభ్యుడిగా కమిటీ చైర్మన్ నామినేట్ చేశారు. ఈ నియామకం సెప్టెంబర్ మూడో తేదీ నుంచి అమల్లోకి వచ్చినట్లు తెలిపారు. మొత్తం తొమ్మిది మంది సభ్యులతో కూడిన ఈ హౌస్ కమిటీకి రాజ్యసభ సభ్యులతో సంబంధించిన పలు కీలక సదుపాయాల పర్యవేక్షణ బాధ్యతలు ఉంటాయి. ఎంపీల నివాస వసతి, వైద్య సదుపాయాలు, ఆహారం, టెలిఫోన్, రవాణా తదితర అంశాలను కమిటీ పర్యవేక్షిస్తుంది. ఈ సందర్భంగా బిఎంఆర్ మాట్లాడుతూ తనకు ఈ బాధ్యత అప్పగించినందుకు కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా పదవికి వన్నె తెచ్చేలా పనిచేస్తానని ఆయన తెలిపారు. కమిటీ సభ్యునిగా ఎంపిక చేయడం పట్ల ఆయన అనుచరులు, అభిమానులు, పలువురు ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

# గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు

**అమ్మవారికి సారే తీసుకుపోతున్న ఎమ్మెల్యే, గ్రామస్తులు**



అమ్మవారికి సారే తీసుకుపోతున్న ఎమ్మెల్యే, గ్రామస్తులు

**కావలి( మీ తీర్పు ):**
కావలి మండల పరిధిలోని కట్టకింద పాలెం గ్రామంలో నిలసియున్న ఒతీఅకనేటమ్మ తల్లి కి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డివి.కృష్ణారెడ్డి గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు. అమ్మవారికి అర్చనలు అభిషేకాలు ప్రత్యేక పూజ కార్యక్రమాలు వేద పండితులు నిర్వహించారు. సారే పూలమాలలు, గాజులు, పండ్లు అమ్మవారికి ఎమ్మెల్యే సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ దేవతకు గ్రామోత్సవాలు నిర్వహించడం వల్ల ఆ గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా సాగుతూ గ్రామంలో ఎలాంటి చెడు జరగకుండా గ్రామస్తులు ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలతో అభివృద్ధి చెందడం జరుగుతుందన్నారు. గ్రామ అభివృద్ధికి తన వంతుగా అన్ని విధాల ఆదుకుంటానని గ్రామస్తులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**కావలి (మీ తీర్పు ):**
సమాజంలో విద్య విలువలను పెంపొందించడంతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, దేశభక్తి వంటి సద్గుణాలను పెంపొందించడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్యే డివి కృష్ణారెడ్డి తెలిపారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని విద్యారంగ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఉపాధ్యాయుల సంక్షేమానికి, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు,ఉపాధ్యాయులు పలువురు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెలే

# క్రీడలతోనే మానసిక ఉల్లాసం : ఎంపీ. వీ పి ఆర్

**కావలి (మీ తీర్పు ):** ప్రతి విద్యార్థి క్రీడలో ఆడడం వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. కావలి నియోజకవర్గం లోని అల్లూరు మండలంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో శుక్రవారం ఏపీ 12వ సీనియర్ అంతర్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి వచ్చిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే డివి కృష్ణారెడ్డి లకు ఛాంపియన్ షిప్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. రిబ్బన్ కట్ చేసి క్రీడా పోటీలను ప్రారంభించి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడల్లో పాల్గొనడం వల్ల క్రమశిక్షణ, శారీరిక ధారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత ఏర్పడుతుందన్నారు. యువత క్రీడల్లో రాణించి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు ప్రత్యేకమైన గుర్తింపు తీసుకొస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.



ఆటలను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

## గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రధానం

ఏపీ బాల్ బ్యాట్మెంటన్ అసోసియేషన్, నెల్లూరు జిల్లా బాల్ బ్యాట్మెంటన్ అసోసియేషన్ సంయుక్త నిర్వహణలో జరిగిన ఏపీ 12వ బాలికలు బాలుర అంతర్ జిల్లా బాల్ బ్యాట్మెంటన్ ఛాంపియన్షిప్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. బాలుర విభాగంలో ప్రథమ బహుమతి ప్రకాశం జిల్లా టీం రెండో బహుమతి విశాఖపట్నం టీం గెలుచుకున్నారు. అదేవిధంగా మహిళల విభాగంలో మొదటి బహుమతి విశాఖపట్నం




రెండో బహుమతి గుంటూరు జిల్లా టీం లకు బహుమతులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు.

# తాగునీటి సమస్యను పరిష్కరించాలి...

**కావలి (మీ తీర్పు ):** భారతీయ జనతా పార్టీ కావలి ఒకటో పట్టణ శాఖ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షులు మంద కిరణ్ కుమార్ అధ్యక్షతన సోమవారం నాడు భాజపా జనతా వారధి కార్యక్రమంలో భాగంగా సోమవారం నిర్వహించే ప్రజా విజ్ఞప్తుల వేదిక కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయం లో ఏవో కు వినతిపత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కావలి పట్టణంలో తీవ్రంగా ఉన్న తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించడంతో పాటు, ప్రజలు అధిక సంఖ్యలో వచ్చే ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్ల సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. కావలి పట్టణంలో ఎండల తీవ్రత, భూగర్భ జలాలు అడుగంటిపోవడం తదితర కారణాలతో అనేక ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చిందని వారు పేర్కొన్నారు. ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రతి వార్డులో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కావలి ఆర్డీవో కార్యాలయం, కావలి మండల రెవెన్యూ అధికారి కార్యాలయం, సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం వంటి ప్రభుత్వ కార్యాలయాలకు ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తున్నప్పటికీ, అక్కడ తగిన మరుగుదొడ్ల సౌకర్యం లేక మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలతో వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళలు, పురుషులకు ప్రత్యేకంగా పరిశుభ్రమైన, సురక్షితమైన మరుగుదొడ్లను ఏర్పాటు చేసి, వాటి నిరంతర నిర్వహణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యువ మోర్చా పట్టణ ప్రధాన కార్యదర్శి దేవాండ్ల రాకేష్,నెల్లూరు సుభాష్,శ్రీనిక్ కుమార్ జైన్ తదితరులు పాల్గొన్నారు.




వినతి పత్రం అందజేస్తున్న భాజపా నాయకులు.

# నేత్రదానం చేయండి... అందులకు చూపునివ్వండి

**కావలి( మీ తీర్పు ):**
జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కావలి పట్టణంలో నిర్వహించిన 'బ్లైండ్‌ఫోల్డ్ వాక్' ను బీపీఎస్ సెంటర్ నుంచి రెడ్‌క్రాస్ భవనం వరకు సాగిన ఈ వినూత్న ర్యాలీని కావలి రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ: ప్రతి మనిషి మరణించిన తర్వాత అతని శరీరం మట్టిలో కలిసిపోయినా... దానం చేసిన కళ్ళు ద్వారా మరొకరి జీవితాల్లో వెలుగునివ్వచ్చు అన్నారు. దేశంలో లక్షలాది మంది అంధత్వంతోబాధపడుతున్నారని, కార్నియా సమస్యలతో చూపు కోల్పోయిన వారికి నేత్రదానమే ఏకైక పరిష్కారమని స్పష్టం చేశారు.మరణానంతరం చేసే నేత్రదానం ఇద్దరి జీవితాల్లో శాశ్వతంగా సరికొత్త వెలుగులు నింపుతుందని పేర్కొన్నారు.
చూపు లేనివారి సమస్యలను స్వయంగా అనుభవించి అర్థం చేసుకోవడంతో పాటు, సమాజంలో నేత్రదానంపై ఉన్న అపోహలను తొలగించడానికే ఈ 'బ్లైండ్‌ఫోల్డ్ వాక్' చేపట్టినట్లు వివరించారు.
చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని, కళ్లకు గంతలతో నడిచిన విద్యార్థులు, యువత "నేత్రదానం చేయండి.. అంధుల జీవితాల్లో వెలుగులు నింపండి" అంటూ చేసిన నినాదాలు పట్టణ వీధుల్లో మార్మోగాయి. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు డి. రవిప్రకాష్, కె. హరినారెడ్డి,జిల్లా రెడ్ క్రాస్ ప్రతినిధులు కలికి శ్రీహరిరెడ్డి,డా. పాదర్తి నాగరాజు, రోటరీ క్లబ్ అధ్యక్షులు గునపాటి సురేష్‌రెడ్డి, రొటేరియన్లు నల్లూరి రవికుమార్, స్వర్ణలత, శంకర్, రజని, అభయం స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు ఇలింద్ర శ్రీవాణి, సక్షం ప్రతినిధి నాగమణికుమారిలతో పాటు ఐఎంఏ, వాసవి వనిత క్లబ్, లెజెండ్స్ సభ్యులు, జూనియర్ రెడ్‌క్రాస్ విద్యార్థులు, రెడ్‌క్రాస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మీ తీర్పు
నిజం మా ధర్మం
ప్రజల పక్షమే మా స్వరం

## హరీశ్‌రావు వాగ్వాదం

తెలంగాణ శాసనసభలో మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల దాడి ఆరోపణలు, సభ స్థానానికి జరిగిన అవమానంపై బీఆర్ఎస్ నేత హరీష్ రావు మరియు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనలో బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై మగ పోలీసులు అమానుషంగా ప్రవర్తించారని, చీరలు లాగి వేధించిన దృశ్యాలు కనిపిస్తున్నా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోగా తిరిగి ఎమ్మెల్యేలపైనే కేసులు పెట్టడం దారుణమని హరీష్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది గౌరవసభ కాదని, కౌరవసభగా మారిందని విమర్శించారు.

ఈ వ్యాఖ్యలపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీవ్రంగా స్పందిస్తూ, "హరీష్ రావు, ఆవేశం నీకు కాదు నాకు ఉండాలి. అవమానం జరిగింది నీ తల్లికి కాదు, నా తల్లికి" అని ఘాటుగా బదులిచ్చారు. సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి తనకు సోదరీమణులతో సమానమని, కానీ సభలో స్పీకర్ పదవినీ, తన తల్లిని ఉద్దేశించి బీఆర్ఎస్ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. దీనికి సంబంధించి ఎమ్మెల్సీ తాతా మధు స్పందిస్తూ, తాను ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని, ఒకవేళ స్పీకర్ మనస్తాపానికి గురైతే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్లు తెలిపారు.

ఇదే అంశంపై మంత్రి సీతక్క మాట్లాడుతూ, అసెంబ్లీ వద్ద ప్రవర్తించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ పదవిని దూషించడం, మహిళా పోలీసుల ఎదుట అనుచితంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. అయితే, మహిళా ప్రజాప్రతినిధులపై నిజంగానే పోలీసుల దాడి జరిగి ఉంటే సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీతక్క స్పష్టం చేశారు.

## ఎర్రవల్లి నివాసం వద్ద తీవ్ర కలకలం

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి నివాసం వద్ద చోటుచేసుకున్న పరిణామాలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపాయి. కాంగ్రెస్ శ్రేణులు డప్పులతో ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌ను ముట్టడించేందుకు ప్రయత్నించడంతో, కేసీఆర్‌కు మద్దతుగా వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలను పోలీసులు హకీంపేట వద్ద అడ్డుకుని అరెస్ట్ చేశారు. తమ నాయకుడిపై హత్యాయత్నానికి కుట్ర జరుగుతోందని కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. నిరసనకారులను ఫామ్‌హౌస్ వరకు అనుమతించి, సొంత నేతను కలిసేందుకు వెళ్తున్న తమను అడ్డుకోవడంపై పోలీసుల వైఖరిని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. తమ నాయకుడి భద్రత విషయంలో పోలీసులపై నమ్మకం లేదని, ప్రభుత్వం వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే ఇదంతా చేస్తోందని మండిపడ్డారు.

మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో విమర్శించారు. సభలో మహిళా ప్రజాప్రతినిధులపై జరిగిన ప్రవర్తనను ప్రశ్నించినందుకు తమపైనే కేసులు పెడుతున్నారని ఆరోపిస్తూ సీఎంను 'కలియుగ దుశ్శాసనుడు'గా అభివర్ణించారు. కేసీఆర్ ప్రాణాలకు ప్రమాదం తలపెట్టేలా అధికార పక్షం మాట్లాడిస్తోందని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఆంక్షలు విధించినా తాము ప్రజాక్షేత్రంలోనే పోరాడతామని స్పష్టం చేశారు.

అరెస్ట్ చేసిన నేతలను బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకోవడంతో ఇరువర్గాల మధ్య నినాదాలు, తోపులాట మొదలై చివరకు రాళ్లు, కుర్చీలు విసురుకునే వరకు వెళ్లింది. ఈ పరస్పర దాడుల్లో పలువురు కార్యకర్తలకు గాయాలయ్యాయి. ఒక మహిళా కార్యకర్త చేయి విరిగినట్లు సమాచారం. పోలీసులు అదనపు బలగాలను రప్పించి పరిస్థితిని అదుపులోకి తెచ్చి ఇరువర్గాలను చెదరగొట్టారు. ప్రస్తుతం ఆయా పోలీస్ స్టేషన్ల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఎమ్మెల్యే సారు.... సమస్య పరిష్కరించిన తీరు

**కావలి (మీ తీర్పు ):** ప్రజా సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువస్తే తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించిన తీరు కావలి పట్టణంలోని 13వ వార్డులో సోమవారం కనిపించింది. వార్డులో అగ్రహారం బావికి సంబంధించిన సమస్య కొంతకాలంగా స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తోంది. బావికి సంబంధించిన ఒకవైపు గోడ కూలిపోవడంతో వర్షాకాలంలో చెరువు నిండిన సమయంలో చెరువు నీరు, బావిలోని నీరు కలిసిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో బావి నీటిని వినియోగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఈ సమస్యను 13వ వార్డుకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు ఎమ్మెల్యే డివి. కృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల ఇబ్బందులను తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి కావలి మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో మున్సిపల్ అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన బావిలో పూడికతీత పనులను చేపట్టారు. దీంతో సమస్య పరిష్కారం దిశగా అడుగులు పడటంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజలకు ఇబ్బంది కలిగించే సమస్యలను గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారం చూపేందుకు ఇదే విధమైన చొరవ కొనసాగించాలని వారు కోరుతున్నారు.

"ప్రజల సమస్యే తన సమస్యగా భావించి.. అధికార యంత్రాంగాన్ని కదిలించి పరిష్కారం చూపే నాయకత్వం కావాలి" అంటూ స్థానికులు ఎమ్మెల్యే చొరవను స్థానిక ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో 13వ వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పృద్వి, నాయకులు కురేటి శ్రీనివాసులు, గాదం శెట్టి వంశీకృష్ణ, పూడిపర్తి మురళి, సుధీర్ యాదవ్, మెట్ట కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు అభినందనలు తెలుపుతున్న స్థానిక నాయకులు

# మత్తులో.. పల్లెలు చిత్తు...

**గ్రామాల్లో నాటుసారా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. పెద్ద చిన్న అనే తేడా లేకుండా మత్తులో ఊగుతున్నారు. వీటి కట్టడికి పటిష్ట చర్యలు లేకపోవడంతో పల్లెల్లో వీటి పాగా పెరిగిపోయింది. ఫలితంగా అటు అనారోగ్య పాలవుతూ ఆర్థికంగా కృంగిపోతున్నారు. క్షణికావేసాలకు లోనై తప్పులు చేస్తున్నారు. పల్లెల్లో సారా,మద్యం అధికంగా విక్రయిస్తున్న తీరుపై "మీ తీర్పు" ప్రత్యేక కథనం...**

**కావలి (మీ తీర్పు ):** మద్యానికి అలవాటు పడుతున్న కొందరు రోజువారి కూలి పనులు చేసి సంపాదించిన డబ్బుని మద్యానికే అధికంగా ఖర్చు చేస్తున్నారు దీంతో కుటుంబ అవసరాలకు, పిల్లల చదువులు, వైద్య అవసరాలకు డబ్బు లేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితులు ఎన్నో కనిపిస్తున్నాయి.



పట్టుబడిన సారాయితో ముద్దాయి అరెస్ట్ చేసిన ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ అధికారులు

### పెరుగుతున్న వివాదాలు...

గ్రామీణ ప్రాంతాల్లో నాటు సారా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నాటు సార తయారీ విక్రయాలను అడ్డుకోవలసిన సంబంధిత శాఖల పర్యవేక్షణ లోపించడంతో పలు పల్లెల్లో ఈ దందా జోరుగా సాగుతుందని ఆరోపణలు వస్తున్నాయి.

సారా, మద్యం తాగి వాహనాలు నడపడంతో పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. మత్తులో విచక్షణ కోల్పోయి అఘాయిత్యాలకు పాల్పడుతున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఉన్నవాళ్లను కోల్పోవడంతో పాటు శిక్షలు పడి చెరసాలలో ఊసలు లెక్కబెడుతున్నారు. గతం లో మద్యపానం నిషేధించి రాష్ట్రస్థాయిలో ఉద్యమాలు చేపట్టిన దుబగుంట రోశమ్మ లాంటి ఆదర్శ మహిళలను స్ఫూర్తిగా తీసుకొని మద్యాన్ని అరికట్టాల్సి ఉంది ప్రజలే సంఘటితమై బెల్టు దుకాణాలు నిర్వహించకుండా అడ్డుకోవడం పెద్ద విశేషమేమీ కాదు.

### ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ నిఘా నేత్రం ఇలా...

ఉదయగిరినియోజకవర్గం లోని జలదంకి, కావలి మండలంలోని బోగోలు మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో విక్రయాలు అధికంగా ఉండటం స్థానికంగా ఆందోళన కలిగిస్తుంది. సాయంత్రం అయితే చాలు నాటు సారా మద్యం సీసాలు గ్రామ నడిబడ్డనే ప్రత్యక్షమవుతున్నాయి. నిత్యం పోలీసులు నిఘా ఉంచి ఎప్పటికప్పుడు అరెస్టు చేస్తున్న కట్టడి కాకపోవడం గమనార్హం.

### కేసులు వివరాలు ఎలా......

2024 అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు

కేసులు -5, అరెస్టు అయిన వ్యక్తులు 5మంది, 37 లీటర్ల సారా స్వాధీనం, 1 వాహనం స్వాధీనం, 400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం.

55 బెల్ట్ దుకాణాలు తనిఖీ, 55 మంది అరెస్టు, 713 బాటిల్స్ స్వాధీనం.

### 2025 ఏడాదిలో...

కేసులు మూడు, ముద్దాయిలు ఐదు మంది అరెస్టు, 20 లీటర్ల నాటు సారా స్వాధీనం, 100 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం. ఒక వాహనం స్వాధీనం.

ఇతర రాష్ట్రాల మద్యం రెండు కేసులు, ముగ్గురు ముద్దాయిల అరెస్టు. బెల్ట్ దుకాణాలపై దాడులు చేసి 87 కేసులు 88 మంది ముద్దాయిల అరెస్టు, 1040 మద్యం బాటిల్స్ స్వాధీనం.

### 2026 ఏడాదిలో...

36 కేసులు 36 మంది అరెస్టు, 293 బాటిల్స్ స్వాధీనం.

దాడులు చేస్తున్నాం : బి. వెంకట్రావు,ఎఱ, ప్రొహిబిషన్ ఢ ఎక్సైజ్ కావలి.

నాటు సారా, గొలుసు దుకాణాలపై ఎప్పటికప్పుడు నిగా ఉంచుతున్నాం ప్రత్యేక వాహనాల్లో సిబ్బంది పర్యటిస్తూ మద్యం అమ్మకాలపై దాడులు చేస్తూ బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నాం. ఎక్కడైనా పల్లెల్లో అక్రమంగా మద్యం సారా, విక్రయిస్తే కఠినంగా వ్యవహరిస్తాం.

# అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**సోషల్ మీడియాను యాక్టివ్ గా వాడాలి**

**టీడీపీ నేతలకు నారా లోకేశ్ దిశానిర్దేశం**

**అమరావతి:** తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో రెండో రోజు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నేతలను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. 'పొలిటికల్ కమ్యూనికేషన్ అండ్ పబ్లిక్ ఓరియంటేషన్' అనే అంశంపై మాట్లాడుతూ, ఆయన నేరుగా సభికులను "మీలో ఎంతమంది సోషల్ మీడియాను చురుకుగా వినియోగిస్తున్నారు?" అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నతోనే సాంకేతికతను రాజకీయ ప్రచారానికి వాడుకోవాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు. "సోషల్ మీడియానే కదా అని తేలిగ్గా తీసుకోవద్దు. దీనిపై చాలా సీరియస్‌గా ఉండాలి" అని లోకేశ్ నేతలకు స్పష్టం చేశారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు చేరవేయాలని ఆయన సూచించారు. చిన్న స్థాయి నాయకులైన ఏఎంసీ, కార్పొరేషన్ ఛైర్మన్లు కూడా తాము చేస్తున్న పనులను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు వివరిస్తున్నారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీని ఆయన ఉదాహరణగా చూపారు. ప్రధాని మోదీ సైతం తన సందేశాలను సెల్ఫీ వీడియోల ద్వారా ప్రజలకు చేరవేస్తున్నారని లోకేశ్ పేర్కొన్నారు. తాను కూడా సుజ్లాన్ విండ్ ప్రాజెక్టు శంకుస్థాపన, డీఎస్సీపై జరుగుతున్న దుష్ప్రచారం వంటి అంశాలపై సెల్ఫీ వీడియోలు తీసి వాస్తవాలను ప్రజల ముందు ఉంచానని తెలిపారు. విషయం చిన్నదైనా, పెద్దదైనా ప్రజలకు నిజాలు తెలియజేయాల్సిన బాధ్యత నేతలపై ఉందని అన్నారు. ప్రతిపక్షాల తీరుపై లోకేశ్ తీవ్రంగా స్పందించారు. ప్రతిపక్షం పని కేవలం ప్రభుత్వంపై బురదజల్లడమేనని, వారి దుష్ప్రచారాన్ని సోషల్ మీడియా వేదికగా ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వైసీపీ నేతలు, కార్యకర్తలు తమ నాయకుడు 'జగన్ మావిగన్' అంటే గుడ్డిగా సమర్థిస్తున్నారని, కానీ టీడీపీ అలా కాకుండా వాస్తవాలతో ప్రజల్లోకి వెళ్లాలని చెప్పారు. అమరావతిని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని, ఈ విషయాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

మీ తీర్పు
నిజం మా ధర్మం
ప్రజల పక్షమే మా స్వరం

# డీఎస్సీపై వైసీపీ దుష్ప్రచారం చేస్తున్నది

**పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్**

**అమరావతి :** టీడీపీ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్నది 100 శాతం దుష్ప్రచారమేనని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తీవ్రంగా విమర్శించారు. కూటమి ప్రభుత్వం సాధిస్తున్న విజయాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే వైసీపీ ఈ తరహా డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపిందని ఆయన ఆరోపించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెలిగొండ ప్రాజెక్టు, పోలవరం ఎడమ కాలువ నుంచి నీటిని విడుదల చేయడంతో రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో తమ ఓటు బ్యాంకుకు నష్టం జరుగుతుందనే భయం వైసీపీని వెంటాడుతోందని బోడే ప్రసాద్ అన్నారు. అందుకే ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమాన్ని ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ భుజానికెత్తుకున్నారని విమర్శించారు. డీఎస్సీలో మెరిట్ ఆధారంగా ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులపై కూడా అక్రమాలు జరిగాయంటూ ఒక పత్రికను అడ్డుపెట్టుకుని విష ప్రచారం చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తన నియోజకవర్గంలోని ఇద్దరు అక్కాచెల్లెళ్ల ఉదంతాన్ని ఆయన ఉదహరించారు. సొంత ఇల్లు కూడా లేక అద్దె ఇంట్లో ఉంటున్న ఆ యువతులు కష్టపడి చదివి డీఎస్సీలో ఉద్యోగాలు సాధించారని, వారిలో ఒకరు 2019లో కేవలం ఒక్క మార్కు తేడాతో ఉద్యోగం కోల్పోయారని తెలిపారు. ఐదేళ్ల తర్వాత వారి కల నెరవేరితే, వారి మెరిట్‌ను కూడా ప్రశ్నిస్తూ వైసీపీ నేతలు అవమానించడం బాధాకరమన్నారు. ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని వారు గతంలో యువత జీవితాలతో ఆడుకున్నారని ఆరోపించారు. గతంలో వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో చేసిన తరహాలోనే ఇప్పుడు డీఎస్సీ అభ్యర్థులపై అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన వేలాది మంది యువత సహనాన్ని పరీక్షించవద్దని హెచ్చరించారు. యువత తిరగబడితే దాని ప్రభావం ఎలా ఉంటుందో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి తెలుస్తుందని అన్నారు. డీఎస్సీపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని ప్రజల్లోకి వెళ్లి తిప్పికొడతామని బోడే ప్రసాద్ స్పష్టం చేశారు.

# జిల్లాలో రీ-సర్వే, సివిల్ సప్లైస్ పనులను వేగవంతం చేయాలి

**పిజిఆర్ఎస్ దరఖాస్తుల**

**పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు**

**జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు**

**తిరుపతి(మీతీర్పు):**

జిల్లాలోని అన్ని మండలాల్లో రీ-సర్వే ప్రక్రియ, ఈ-కేవైసీ (e-KYC) ప్రక్రియ, కోర్టు కేసులు, సివిల్ సప్లైస్ సేవలను నిర్దేశించిన కాలపరిమితి ప్రకారం వేగవంతంగా పూర్తి చేయాలని తహశీల్దార్ లను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు ఆదేశించారు.

సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని మిని విసి హాల్ నుండి జిల్లా జాయింట్ కలెక్టర్ డిఆర్ఓ జి.నరసింహులుతో కలసి తహశీల్దార్లతో జిల్లాలోని పలు మండలాల పరిధిలో జరుగుతున్న రీ-సర్వే, ఈ-కేవైసీ (వ-ఖ్జ) ప్రక్రియ, పి జి ఆర్ ఎస్ దరఖాస్తుల పురోగతి, సర్వే రికార్డులు మరియు పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ ప్రగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమం లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామాంజనమ్మ, ఆర్డిఓ లు, తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, కోర్టు కేసులు, ఎస్ఐఆర్ పెండింగ్ అంశాలను అత్యున్నత ప్రాధాన్యతతో తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని, తహశీల్దార్లు, ఆర్‌డీవోలు, సంబంధిత అధికారులు నిరంతరం సమీక్షిస్తూ జవాబుదారీతనంతో పనిచేయాలని ఆదేశించారు. గ్రామ స్థాయి సిబ్బంది నుండి ఆర్డీవోల వరకు అందరూ సమన్వయంతో పనిచేసి రీ-సర్వే మరియు పాస్ పుస్తకాల పంపిణీ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. తిరుపతి రూరల్, తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి ప్రాంతాల్లో పెండింగ్ పనులను వేగవంతం చేయాలని, రైస్ కార్డ్ సేవలను నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేసి, సెప్టెంబర్ 1--15 మధ్య పంపిణీ సమయంలో అన్ని లబ్ధిదారుల ఈ-కేవైసీ పూర్తి చేయడంతో పాటు మరణించిన వారి పేర్లను తొలగించాలని సూచించారు. రీ-సర్వేలో ఫేజ్-1 నుంచి ఫేజ్-6 లక్ష్యాలను సాధించి, గ్రౌండ్ ట్రూతింగ్ అనంతరం వెక్టొరైజేషన్, సంబంధిత లాగిన్ ప్రక్రియలను 4--5 రోజుల్లో పూర్తి చేయాలని, సెప్టెంబర్ 15 నాటికి నాణ్యమైన పనులు పూర్తి చేసి అక్టోబర్ సైకిల్‌కు 85 శాతానికి పైగా ఈ-కేవైసీ సాధించాలని ఆదేశించారు. ఓజిలి, దొరవారి సత్రం, వడమాలపేట, పెళ్లకూరు, ఎర్రవారిపాలెం, తిరుపతి రూరల్, పెలగలూరు, పాకాల, ఓబులవారిపల్లె, కోడూరు, చిట్వేలు, చిన్నగొట్టిగల్లు మండలాల్లో ఫేజ్-6 గ్రౌండ్ ట్రూథింగ్ (వ-ఖ్జ) పెండింగ్‌లో ఉన్న ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. =ా= అప్పీళ్లను ా=జమీలో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని, క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. పి జి ఆర్ ఎస్ ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని తహశీల్దార్లను ఆదేశించారు. ఒకే వ్యక్తి పలుమార్లు ఫిర్యాదులు చేసే పరిస్థితి తలెత్తకుండా స్థానిక





సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించాలని సూచించారు. భూ వివాదాలు, ఆక్రమణలు, శ్మశాన వాటికల దారులు, సరిహద్దు సమస్యలపై ఇరుపక్షాలను పిలిచి త్వరితగతిన విచారణ పూర్తి చేయాలని ఆదేశించారు. ఫిర్యాదుదారుల వాదనలు స్వయంగా విని, విచారణ అనంతరం స్పష్టమైన రాతపూర్వక ఎండార్స్‌మెంట్ అందజేయాలని సూచించారు.

డిఆర్ఓ మాట్లాడుతూ కంటెంప్ట్ కేసుల సంఖ్యను తగ్గించడమే ప్రధాన లక్ష్యంగా అధికారులు బాధ్యతాయుతంగా, సమయపాలనతో చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కోర్టు ఆదేశాలు, నోటీసులను పిటిషనర్లకు ాాణ ద్వారా, స్థానికంగా ఉన్న వారికి నేరుగా వెళ్ళి అందజేయాలని అధికారులను ఆదేశించారు. RPAD రశీదులు, పోస్టల్ ట్రాకింగ్ రిపోర్టులు, సంబంధిత కాపీలను కన్సర్న్ ఫైళ్లలో తప్పనిసరిగా భద్రపరచాలని సూచించారు. కేసులను త్వరితగతిన వెరిఫై చేసి, సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని ఆదేశించారు.

# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు**

**విద్యార్థుల సమగ్ర వికాసమే లక్ష్యం**

**ప్రతి బిడ్డ పాఠశాలకు వచ్చేలా, నాణ్యమైన విద్య అందేలా చర్యలు**

**జిల్లాలో 65 మంది ఉత్తమ ఉపాధ్యాయులను**

**ఘనంగా సత్కరించి ప్రశంశా పత్రాలు అందజేత**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్**

**తిరుపతి(మీతీర్పు):**

రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో కీలక సంస్కరణలను అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం ఉదయం తిరుపతి కచ్ఛపి కళాక్షేత్రంలో భారత మాజీ రాష్ట్రపతి, మహనీయ విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్. కుమార్, అడిషనల్ ప్రాజక్ట్ కో ఆర్డినేటర్, సమగ్రశిక్ష భరత్ కుమార్ రెడ్డి లతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సమర్థ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో కీలక సంస్కరణలను అమలు చేస్తోందన్నారు. మారుతున్న కాలానికి, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగ రంగాల అవసరాలకు అనుగుణంగా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. తల్లికి వందనం పథకం ద్వారా గత రెండు సంవత్సరాల్లో అర్హులైన ప్రతి విద్యార్థికి, కుటుంబంలో పిల్లల సంఖ్యతో సంబంధం లేకుండా నేరుగా తల్లుల ఖాతాల్లో ఆర్థిక సహాయం జమ చేసినట్లు తెలిపారు. తిరుపతి జిల్లాలో మొత్తం 2,58,000 మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందగా, వారిలో 1,72,000 మందికి పైగా ఒకరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్న కుటుంబాలకు చెందినవారేనని వివరించారు.

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టి, ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రాథమిక, ఫౌండేషన్, మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి వరకు ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా వ్యవస్థను బలోపేతం చేశామన్నారు. ఒకే తరగతి గదిలో వివిధ తరగతుల విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు బోధించే విధానానికి స్వస్తి పలికామని, ఈ సంస్కరణల ఫలితాలు రాబోయే నాలుగైదేళ్లలో స్పష్టంగా కనిపిస్తాయన్నారు. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు జిల్లాలో 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన 258 మంది విద్యార్థులకు 'షైనింగ్ స్టార్స్' అవార్డులు అందజేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్--టీచర్ మీటింగ్స్ నిర్వహించడం ద్వారా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఒకే వేదికపైకి వచ్చి విద్యార్థుల చదువు, ప్రవర్తన, పాఠ్యేతర కార్యక్రమాలు, తోటి విద్యార్థులతో వారి ప్రవర్తన తదితర అంశాలపై చర్చించే అవకాశం కల్పించామన్నారు.

విద్యార్థులు కేవలం పాఠ్యాంశాల్లోనే కాకుండా క్రీడలు, సంగీతం, నృత్యం, పఠనం తదితర రంగాల్లోనూ రాణించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని,మార్కులు, ర్యాంకులు మాత్రమే విద్యార్థుల ప్రతిభకు కొలమానం కాదన్నారు. క్రీడలు, ఇతర పాఠ్యేతర కార్యక్రమాలు విద్యార్థుల మానసిక, శారీరక వికాసానికి దోహదపడతాయన్నారు. తరగతిలో మొదటి స్థానాల్లో నిలిచే విద్యార్థులపైనే కాకుండా ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు సమాన శ్రద్ధ చూపాలని, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక ప్రోత్సాహం, మార్గదర్శకత్వం అందించాలన్నారు. చిన్న వయస్సు నుంచే ఐఐటీ, సివిల్స్ వంటి పోటీ పరీక్షల పేరుతో విద్యార్థులపై అధిక ఒత్తిడి తీసుకురావడం సరికాదని, విద్యార్థుల ఆసక్తి, సామర్థ్యాలను గుర్తించి సరైన మార్గదర్శకత్వం అందించాలన్నారు. సాంకేతికత, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఉపాధ్యాయులు కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ పొందాలని సూచించారు. విద్యార్థులు ఇంటర్నెట్, సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధ్యాయుడి మానవతా స్పర్శ విద్యార్థి జీవితాన్ని మార్చగలదని, సమాజంలో నూతన తరాన్ని తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు.

స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ.. తల్లిదండ్రుల తర్వాత విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి వారికి సరైన ప్రోత్సాహం అందించడంలో గురువులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి మరియు విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యార్థుల ఉన్నత విద్యకు ప్రభుత్వం అవసరమైన సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం కృషి చేస్తున్న ఉపాధ్యాయులందరికీ గురుపూజోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్. కుమార్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, అది బాధ్యత, తపస్సు, మహత్తరమైన సామాజిక సేవ అని అన్నారు. గత 100 రోజులుగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేసి, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ, రోజువారీ పరీక్షలు నిర్వహిస్తూ వారి విద్యా ప్రగతికి ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ గారి మార్గదర్శకత్వంలో 36 మండలాల్లో 36 రోజుల పాటు 'బడి పిలుస్తోంది' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని, వేసవి సెలవుల్లో కూడా ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి బడికి దూరమైన పిల్లలను గుర్తించడంతో పాటు, సుమారు 2,500 మంది ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించినట్లు తెలిపారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల బోధనతో పాటు సైన్స్‌పై శాస్త్రీయ దృక్పథం, క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం, యోగా, మెడిటేషన్ ద్వారా మానసిక ప్రశాంతత, 'నో డ్రగ్స్' కార్యక్రమాల ద్వారా మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను గుర్తించి అవార్డులతో సత్కరించడం ద్వారా వారి సేవలను గౌరవిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అమలు చేస్తున్న కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విజయవంతంగా అమలు చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. "ప్రతి బిడ్డ పాఠశాలకు రావాలి, చదువులో రాణించాలి, సత్ప్రజగా ఎదగాలి. 'ప్రతి బిడ్డ మన బిడ్డ -- ప్రతి పాఠశాల మన బాధ్యత' అనే భావనతో విద్యాశాఖ ముందుకు సాగుతోంది" అని అయన తెలిపారు. అనంతరం జిల్లాలోని 65మంది ఉత్తమ ఉపాధ్యాయులకు దుస్సాలువ




కప్పి ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో మాజీ మంత్రి పరసారత్నం, యాదవ కార్పోరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, ఆంధ్రప్రదేశ్ గ్రీన్ అండ్ బ్యుటిఫికేషణ్ చైర్మన్ సుగుణమ్మ, నాయీ బ్రహ్మాన కార్పోరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, మెడికల్ కౌన్సిల్ చైర్మన్ హరి రావు,గ్రంధాలయ సంస్థ చైర్మన్ గురవారెడ్డి విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



మీ తీర్పు
నిజం మా ధర్మం
ప్రజల పక్షమే మా స్వరం

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ యోగి ఆదిత్యనాథ్ గారికి రేణిగుంట ఎయిర్పోర్ట్ లో సాదర స్వాగతం పలుకుతున్న రాష్ట్ర వైద్య మరియు ఆరోగ్య శాఖ మంత్రి

శ్రీ సత్యకుమార్ యాదవ్ , స్థానిక MLA శ్రీ ఆరణి శ్రీనివాసులు,జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ ,ఎస్పీ శ్రీ సుబ్బరాయుడు తదితరులు..

















మీ తీర్పు
నిజం మా ధర్మం
ప్రజల పక్షమే మా స్వరం

# మల్లనూరులో అన్నా క్యాంటీన్‌కు ఆర్వో యూనిట్, వాటర్ డిస్పెన్సర్ వితరణ

**కుప్పం ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా విస్తృతంగా సేవా కార్యక్రమాలు.**




**కుప్పం,సెప్టెంబర్ 08 :**
కుప్పం ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను విస్తృతంగా కొనసాగిస్తున్నారు. కుప్పం రూరల్ మండలం మల్లనూరులోని అన్నా క్యాంటీన్‌కు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో కుప్పం ఇంజనీరింగ్ కాలేజీ ఆధ్వర్యంలో అవసరమైన ఆర్వో వాటర్ ప్యూరిఫికేషన్ యూనిట్ మరియు వాటర్ డిస్పెన్సర్‌ను అందజేశారు.ప్రజలకు నాణ్యమైన, శుద్ధమైన తాగునీరు అందుబాటులో ఉండేలా ఈ సదుపాయాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ముఖ్యంగా అన్నా క్యాంటీన్‌ను సందర్శించే ప్రజలు, సిబ్బందికి సురక్షితమైన తాగునీరు అందించడంలో ఈ ఆర్వో యూనిట్ ఎంతగానో ఉపయోగపడుతుందని కళాశాల ప్రతినిధులు తెలిపారు.సామాజిక బాధ్యతలో భాగంగా ప్రజల ఆరోగ్యం, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కుప్పం ఇంజనీరింగ్ కాలేజీ చేపట్టిన ఈ కార్యక్రమం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్ మాట్లాడుతూ,విద్యతో పాటు సమాజ సేవలోనూ విద్యాసంస్థలు భాగస్వాములు కావాలనే లక్ష్యంతో ఇటువంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ భాస్కరన్, వివిధ విభాగాల అధిపతులు, పి.ఆర్.ఓ ప్రవీణ్ కుమార్, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# పశుబీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోండి

**ఏఎంసీ డైరెక్టర్ పవన్ కుమార్**



**రామకుప్పం సెప్టెంబరు 8**
కూటమి ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ద్వారా అమలు చేస్తున్న పశుబీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ డైరెక్టర్ వి. పవన్ కుమార్ కోరారు. గొర్రెలు, మేకలు మరియు ఇతర పశువులను పెంచుకుంటున్న రైతులు పశుబీమా చేయించుకోవడం ద్వారా పశువుల అకాల మరణాల కారణంగా కలిగే ఆర్థిక నష్టాన్ని కొంతవరకు నివారించుకోవచ్చని ఆయన తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న బీమా రాయితీలను అర్హులైన రైతులు వినియోగించుకుని తమ పశుసంపదకు రక్షణ కల్పించుకోవాలని సూచించారు. పశుపోషణపై ఆధారపడే రైతు కుటుంబాలకు పశుసంపదే ప్రధాన ఆస్తి అని, అనుకోని పరిస్థితుల్లో పశువులు మృతి చెందితే రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని పవన్ కుమార్ పేర్కొన్నారు. అందువల్ల “గొర్రెలు, మేకలకు బీమా చేయిద్దాం -- అకాల మరణాల వల్ల జరిగే ఆర్థిక నష్టాన్ని నివారిద్దాం” అనే లక్ష్యంతో ప్రతి రైతు పశుబీమాపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రాయితీలపై సంబంధిత పశుసంవర్ధక శాఖ అధికారులను సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకుని అర్హత మేరకు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# కుప్పం పురపాలక సంఘం సాధారణ సమావేశం నేడు

**కమిషనర్**

**వి. శ్రీనివాసరావు.**



**కుప్పం,సెప్టెంబర్ 08 :**
కుప్పం పురపాలక సంఘ సాధారణ సమావేశం కార్యాలయంలో జరుగుతుందని పురపాలక సంఘం కమిషనర్ వి. శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన ఈ వివరాలు తెలిపారు. సాధారణ సమావేశం నేడు(9వ తేదీ) బుధవారం కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. కౌన్సిలర్లు, ఆహ్వానితులు అందరూ హాజరు కావాలన్నారు.

# రైతులను కరువు నుండి కాపాడండి

**కడాపిడికి కాంగ్రెస్ నేతల వినతి పత్రం.**



**కుప్పం,సెప్టెంబర్ 08 :**
కుప్పం నియోజకవర్గంలో రైతులు, రైతు కూలీలను కరువు నుండి కాపాడాలని కుప్పం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల గోపి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ కు వినతిపత్రం అందజేశారు. కరువు సమస్య పైన కాంగ్రెస్ పార్టీ గ్రామాల్లో తిరిగి పంటలను పరిశీలించిందన్నారు. తీవ్ర లోటు వర్షపాతం వల్ల మెట్ట ప్రాంత రైతులు పూర్తిగా నష్టపోయారని, వేరుశనగ,రాగి, మొక్కజొన్న,కంది,అనప, పెసరు ఇలాంటి పంటలు ఏవి కూడా చేతికొచ్చే పరిస్థితులు లేవన్నారు. పెట్టుబడి ఈ రోజుల్లో భారీగా అవుతోందన్నారు. కనుక రైతులకు ప్రభుత్వం మునుపటి లాగానే పంట నష్టపరిహారం అంచనా వేసి రైతులకు ప్రతి ఎకరాకి ప్రతి సెంటుకు కూడా ఇన్పుట్ సబ్సిడీ అందించాలని, కుప్పం నియోజకవర్గానికి సంబంధించిన నాలుగు మండలాలను తీవ్ర కరువు మండలాలుగా ప్రకటించాలని,కాంగ్రెస్ పార్టీ కోరుతోందని అన్నారు. పశువుల విషయానికొస్తే పశుగ్రాసం పూర్తిగా ఎండిపోయి పశువులకే గ్రాసం కొరత ఏర్పడిందన్నారు. రైతులు బయట నుండి వచ్చేటువంటి వరిగడ్డిని కొనుగోలు చేస్తే ఒక బండిల్ వరిగడ్డి 300 రూపాయలు, ఒక పశువుకి ఒక రోజుకి సరిపోతుంది. వీలైనంత తొందరగా ఈ సమస్యకి పరిష్కారం చూపాలన్నారు. కుప్పం ప్రాంత భూభాదితులకు కాంగ్రెస్ అండ: కుప్పం నియోజకవర్గంలో చిన్న, సన్నకారు రైతులు ఒక్కొక్క రైతుకి ఒక ఎకరా,రెండు ఎకరాల పొలం ఉంటుందని,పెద్ద రైతులు అంటే మహా అంటే ఐదు ఎకరాలు కలిగి ఉంటారు. ఇలాంటి కుప్పం నియోజకవర్గంలో కంపెనీల పేరుతో వేల ఎకరాలను కంపెనీలకు ఇవ్వడం మహా దారుణం. ఎందుకంటే కుప్పం నియోజకవర్గంలో సాగు భూమికంటే అటవీ భూమి,గుట్టలు ఎక్కువగా ఉన్నాయి.కుప్పం నియోజకవర్గం లోని మొత్తం భూ విస్తీర్ణంలో పోల్చుకుంటే 20 శాతానికి మించి వ్యవసాయ భూమి లేదు. కుప్పం నియోజకవర్గంలో ఒక ఎకరం,రెండు ఎకరాలు కలిగినటువంటి రైతులు 80 శాతం మంది ఉన్నారు. వారికి వ్యవసాయం తప్ప వేరే జీవనాధారమే లేదు. ఆ రైతుల మీద ఆధారపడి బతికే వ్యవసాయ కూలీలు సుమారు కుప్పం నియోజకవర్గంలో 60 శాతం మంది ఉన్నారు. రైతుల భూములు కంపెనీలకి తీసేసుకోవడం వలన రైతులు,రైతు కూలీలు పూర్తిగా దుర్భరమైనటువంటి పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది. రైతులు, రైతు కూలీలు కుప్పం నియోజకవర్గంలో సుఖసంతోషాలుగా ఉండాలంటే రైతుల నుండి భూములు తీసేసుకోవడం మానేయండి. వాస్తవ పరిస్థితులను గ్రామాల్లోకి వెళ్లి పరిశీలించండి. ప్రతి గ్రామంలో కూడా 30 శాతం మందికి భూములు ఉంటే మరో 60,70 శాతం మంది కూలీలు వారి అందరికీ జీవనం.. ఉపాధి రైతు వల్లనే జరుగుతా ఉంది. ఇక భూములు లాగేసుకుంటే వారందరికీ ఉపాధి ఏ విధంగా చూపించగలుగుతారు.మీరు పెట్టే కంపెనీలలో వారికి స్కిల్ లేకుండా ఉపాధి ఇవ్వగలరా? మొదట బహుళ జాతి కంపెనీలకు వందల ఎకరాలు ఒక కంపెనీకి ఇవ్వకుండా,మూడు వందలు,నాలుగు వందల ఎకరాలు మొదటి విడతగా కొన్ని కంపెనీలకు ఇచ్చి దాని ద్వారా ప్రయోజనం ఎంత ఉందో ఆలోచన చేసి తర్వాతే ఎక్కడైతే వ్యవసాయానికి పనికిరాని భూములు ఉన్నాయో వాటిని కేటాయిస్తే రైతులు, రైతు కూలీలు నష్టపోకుండా ఉంటారు. కుప్పం నియోజకవర్గంలో ఎలాంటి మారుమూల ప్రాంతమైన ఈరోజు ఎకరం ధర 50 లక్షల నుండి రెండు కోట్లు, మూడు కోట్లు వరకు పలుకుతా ఉంది. అలాంటి భూములకి 16 లక్షల నుండి 30 లక్షలు ఇవ్వడం అనేది మహా దారుణమైనటువంటి పరిస్థితి. రైతుల నుండి భూములే లాగేసుకుంటుంటే ఇక రైతు పండించే పంట ఏముంటుంది. రైతులు ఎగుమతి చేయడానికి రైతుల దగ్గర ఏం మిగిలి ఉంటుంది అని కూడా కాంగ్రెస్ పార్టీ తరపున ప్రశ్నిస్తున్నాము. రైతు కళ్ళలో ఆనందం చూడాలి,రైతు కూలీల కడుపు నింపాలంటే కుప్పం నియోజకవర్గంలో భూసేకరణను ఆపాలని మేము కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నాం. రైతుల కోసం అండగా నిలబడుతుంది కాంగ్రెస్ పార్టీ కుప్పం నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల గోపి పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ నాయకులు జయప్రకాష్, రోహిణప్ప ,ఇమ్రాన్, నిజాముద్దీన్, ముని రామయ్య, రహంతుల్లా, మండల పార్టీ అధ్యక్షులు పి మునస్వామి, నంజుండప్ప, కృష్ణప్ప గౌడు, ముని కుట్టి, కళాచారి తదితరులు కలిసి వినతి పత్రాలు సమర్పించారు.

# గ్రామ దేవత శ్రీ బంగారమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



**కార్వేటినగరం సెప్టెంబర్ 8**
కార్వేటి నగరంలో వెలిసిన గ్రామ దేవత శ్రీ బంగారమ్మ ఆలయంలో మంగళవారం ఉదయం ఆలయంలో అమ్మవారికి పాలు పెరుగుతేనే హరిద్రవ చందనం కూడిన అభిషేక అర్చన నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అమ్మవారికి మహిళలు పొంగళ్ళు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయం వద్ద అమ్మవారికి రాహుకాలం పూజలు కుంకుమార్చనలు దీపారాధన నిర్వహించారు. భక్తుల అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కొప్పేటి ప్రసాద్ రాయల్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ పిళ్ళై, ఉపాధ్యక్షులు రంగనాథ మొదలియార్, కమిటీ సభ్యులు భక్తులు అమ్మవారిని అది సంఖ్యలో దర్శించుకున్నారు.

# కుప్పంలో పెద్ద రెడ్డి ఆటలు సాగనివ్వం

**ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు**



**రామకుప్పం సెప్టెంబర్ 8 గరుడదాత్రి న్యూస్**
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమర్థవంతమైన సారథ్యంలో కుప్పం నియోజకవర్గంలో మాజీ మంత్రి, వైకాపా నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాజకీయ వ్యూహాలు, అక్రమ ఆటలు ఇకపై ఎంతమాత్రమూ సాగవని స్థానిక ప్రజలు, నాయకులు స్పష్టం చేస్తున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆయనకు మరియు ఆయన వర్గానికి కోలుకోలేని ఘోర పరాభవం ఎదురుకాబోతోందని మండిపడుతున్నారు. అక్రమాలు, దౌర్జన్యాలకు ప్రజలే బుద్ధి చెప్తారు: చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతుంటే, గత పాలనలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని పెద్దిరెడ్డి వర్గం కుప్పం ప్రాంతంలో సాగించిన దౌర్జన్యాలు, రాజకీయ కుట్రలను ప్రజలు ఇంకా మరచిపోలేదని నేతలు విమర్శించారు. చంద్రబాబు గారి ప్రజాదరణ ముందు వైకాపా శ్రేణుల అక్రమాలు సాగవని, రాబోయే స్థానిక ఎన్నికల్లో తమ ఓటు హక్కుతో వారికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. స్థానిక ఎన్నికల్లో వైకాపాకు శూన్యమే: నారా చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలో కుప్పం ఎప్పటికీ అభివృద్ధికి, ప్రజాస్వామ్యానికి చిరునామాగా నిలుస్తుందని, పెద్దిరెడ్డి మార్కు కుట్ర రాజకీయాలకు ఇక్కడ తావులేదని స్పష్టం చేశారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో దుష్టశక్తులను, అక్రమాలకు పాల్పడిన నాయకులను తుడిచిపెట్టేందుకు ప్రజలు సమాయత్తమయ్యారని, కుప్పంలో కూటమి విజయం సాధించి ప్రజాస్వామ్యమే గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ మునుస్వామి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వెంకటరమణ మాజీ అధ్యక్షులు ఆనంద్ రెడ్డి నేతలు చిన్ని కృష్ణ చలపతి పట్టణ నారాయణ చారి తదితరులు పాల్గొన్నారు

# పీహెచ్‌సీలో ‘ఆశా డే’ కార్యక్రమం

**పలమనేరు, సెప్టెంబర్ 08 :**
స్థానిక గంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో మంగళవారం ‘ఆశా డే’ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ లహరి, ఆసుపత్రి సిబ్బంది మరియు ఆశా కార్యకర్తల సమన్వయంతో నిర్వహించినట్లు మండల ప్రధాన వైద్యులు డాక్టర్ జె. శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా గర్భిణుల ఆరోగ్యం, వారు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విస్తృతంగా అవగాహన కల్పించారు. గర్భవతులు ప్రతిరోజూ తీసుకోవాల్సిన సమతుల్య పోషకాహారం, దాని ఆవశ్యకత గురించి వైద్యులు వివరించారు. గర్భిణులు ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో ఆసుపత్రికి వచ్చి, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా గర్భిణులకు మరియు బాలింతలకు ఉచితంగా అందే వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ శ్రీనివాసులు కోరారు. గ్రామీణ స్థాయిలో తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణలో ఆశా కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని, వారు ప్రజలకు మరింత చేరువగా ఉండి వైద్య సేవలు అందేలా కృషి చేయాలన్నారు.



మీ తీర్పు
నిజం మా ధర్మం

# ఎమ్మెల్సీ భరత్, జడ్పీ చైర్మన్ జి. శ్రీనివాసులు పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



**రామకుప్పం, సెప్టెంబర్ 8 :**

కుప్పం వైకాపా ఇంచార్జ్, ఎమ్మెల్సీ కేఆర్జే భరత్ మరియు చిత్తూరు జిల్లా పరిషత్ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులుపై రామకుప్పం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం తెలుగుదేశం పార్టీ నేతలు ఫిర్యాదు చేశారు. కుప్పం గ్రామీణ సీఐ మల్లేష్ యాదవ్ మరియు ఎస్సై మారెప్పలను కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. మంగళవారం కుప్పంలో జరిగిన వైకాపా కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్సీ భరత్ మరియు జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో "రక్తాభిషేకం చేయాలని, గెలవడం కోసం చంపడానికైనా, చావడానికైనా సిద్ధంగా ఉండాలని" కుట్రపూరిత వ్యాఖ్యలు చేశారని, ప్రశాంతంగా ఉన్న కుప్పం నియోజకవర్గంలో అలజడులు సృష్టించే ఉద్దేశంతోనే ఇలాంటి వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. అంతేకాకుండా వారి వ్యాఖ్యలతో రెచ్చిపోయిన వైకాపా కార్యకర్తలు మండలంలో పలుచోట్ల టీడీపీ కార్యకర్తలపై భౌతిక దాడులకు దిగారని తెలిపారు. గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారిని కూడా పరుష పదజాలంతో దూషించారని, ప్రశాంతతకు భంగం కలిగిస్తున్న ఇరువురిపై నాన్-బెయిలబుల్ కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేసి, కుప్పం నియోజకవర్గంలో శాంతిభద్రతలను కాపాడాలని, కార్యకర్తలకు రక్షణ కల్పించాలని ఫిర్యాదులో టీడీపీ నేతలు డిమాండ్ చేశారు.

# సదాశివేశ్వర స్వామి ఆలయంలో ప్రదోష పూజ

**కార్వేటి నగరం సెప్టెంబర్ 8 :**



కార్వేటి నగరం నందలి సుద్దగుంట సమీపము నందు వెలసిన శిష్ట సౌందర్యవల్లి సమేత సదాశివేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఆలయంలో అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం వద్ద నందీశ్వరునికి ప్రదోష పూజ వేద పండితులు మంత్రోచ్చారణ నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయం దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు మోహన్ రాజు ఉపాధ్యక్షులు కృష్ణ స్వామి రాజు, ప్రసాద్ రెడ్డి, కార్యదర్శి, రాజేంద్రరెడ్డి,కోశాధికారులు ప్రసాద్ రాజు, ప్రసాద్ యాదవ్,జనరల్ సెక్రటరీలు, సుబ్బరాయల్ యాదవ్ సంతానం, ప్రతీత్,ఆర్గనైజింగ్ సెక్రటరీలు బాబు రెడ్డి, మునస్వామి,రమేష్ బాబుభక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన గాలి.మురళి నాయుడు



**తొట్టంబేడు సెప్టెంబర్ 08 :**

శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండల మాజీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు టిడిపి సీనియర్ నాయకులు గాలి మురళినాయుడు మంగళవారం తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ సాయిపూజతో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.మండల కేంద్రంలో రోగులకు కల్పిస్తున్న సదుపాయాలు, ఓపీ, ఇన్‌పేషెంట్ సేవలు, మందుల లభ్యత, పరీక్షల నిర్వహణ తదితర అంశాలపై డాక్టర్‌తో చర్చించారు.అలాగే ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి, రోగుల సంరక్షణ కోసం చేపడుతున్న చర్యల గురించి ఆరా తీశారు.అనంతరం స్టాఫ్ నర్స్ రేఖ ఆయనకు బీపీ చెక్ చేసి, పాటించాల్సిన ఆరోగ్య నియమాల గురించి తెలియపరిచారు. ఈ సందర్భంగా గాలి.మురళి నాయుడు మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని తెలిపారు.

# అక్రమ లేవుట్లు వేస్తాం మా ఇష్ట రాజ్యంగా అమ్ముతాం

సూళ్లూరుపేట పట్టణంలో పుట్టగొడుగుల్లా

అక్రమ లేవుట్లు

అనుమతులు ఉండవు...... అయినా అమ్ముతారు

బఫర్ జోన్ (చెరువు) పక్కన వేస్తారు నియమ నిబంధనలు వారికి వర్తించవు

అధికారులకు తెలిసినా తెలియనట్లు నటిస్తారు

సూళ్లూరుపేట మున్సిపాలిటీ అధికారులు వున్నట్టా లెన్నట్టా

ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి

తుడా అనుమతులు లేకుండా వెలుస్తున్న అక్రమ లేవుట్లు

జిల్లా కలెక్టర్ సారు..... ఈ అక్రమ లేవుట్లు గురించి

జర పట్టించుకోవలని కోరుతున్న

సూళ్లూరుపేట పట్టణ ప్రజలు




సూళ్లూరుపేట పట్టణంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి అక్రమ లేవుట్లు. ప్రభుత్వ నియమ నిబంధనలను ప్రకారం వ్యవహరించవల్సిన అధికారులు అవి ఏమి పట్టనట్లు వ్యవహరించడం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పాలకులు అధికారులు కుమ్మక్కు అయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు.సూళ్లూరుపేట పట్టణంలో అధికార ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు ఒక్కట్టయ్యారు అక్రమ లేవుట్లు వేస్తున్నారు అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రశ్నించవల్సిన ప్రతిపక్ష నాయకులు సైతం అధికార పార్టీకి చెందిన నేతలతో చేతులు కలిపి సయ్యాట ఆడుతున్నారు అన్నది సూళ్లూరుపేట పట్టణ ప్రజల ఆరోపణ.వివరాల్లోకి వెళ్తే.....

**సూళ్లూరుపేట(మీతీర్పు):** సూళ్లూరుపేట పట్టణంలో అన్ని శాఖలకు చెందిన అధికారులు ఉమ్మడి ఒక్కట్టయ్యారు అనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. సూళ్లూరుపేట పట్టణంలో అక్రమ లేవుట్లు వేస్తున్న వాటికి అనుమతులు ఉన్నాయా లేవా అన్నది పరిశీలించకుండా కళ్ళు వున్న కబుద్ధుల్లా వ్యవహరిస్తున్నారు అధికారులు. చెరువు పక్కన లేవుట్లు కు అనుమతులు ఎలా ఇస్తున్నారు అన్నది అంతుచిక్కని ప్రశ్నలా వుంది. సూళ్లూరుపేట మున్సిపల్ పరిధిలో వేస్తున్న లేవుట్లు కు మున్సిపల్ అధికారులు అనుమతులు ఎలా ఇస్తున్నారు, మున్సిపల్ అధికారులు అసలు పరిశీలించారా లేదా అన్నది సూళ్లూరుపేట మున్సిపల్ అధికారులు వారికే తెలియాలి మరి. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారుని సూళ్లూరుపేట పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. సూళ్లూరుపేట మున్సిపల్ కీలక అధికారికి తెలిసి జరుగుతుందా లేదా తెలియకుండా జరుగుతుందా అన్నది ప్రజల మదిని దోచేస్తున్న ప్రశ్న. సూళ్లూరుపేట మున్సిపల్ కీలక అధికారి తీరు ఏమాత్రం ప్రజలకు నచ్చడం లేదు. సూళ్లూరుపేట మున్సిపల్ కీలక అధికారి పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూళ్లూరుపేట పట్టణ ప్రజలు కోరుతున్నారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీ లో బఫర్ జోన్ అనే పదం మరిచి అనుమతులు ఇవ్వడం వెనుక ఉన్న మర్మం ఏమిటి అన్నది అంతు చిక్కని ప్రశ్నలా వుంది.సూళ్లూరుపేట మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడుతున్న అధికారులు కిమ్మకుంటారో అర్థం కావడం లేదు. తుడా అనుమతులు లేకుండా అక్రమ లేవుట్లు వెలుస్తున్న తుడా అధికారులు సైతం సూళ్లూరుపేట పట్టణం వైపు దృష్టి సారించకుండా ఉండడం పలు విమర్శలకు తావిస్తోంది. తుడా అధికారులు ఇకనైనా మేల్కొని సూళ్లూరుపేట పట్టణం వైపు దృష్టి సారిస్తే ప్రభుత్వం కు భారీ ఆదాయం వచ్చే అవకాశం ఉంది. మరి తుడా అధికారులు దృష్టి సారిస్తారో లేదో కాలమే సమాధానం చెప్పాలి. జిల్లా కలెక్టర్ గారైన ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

## సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్ తమిళనాడులో కొత్త కూటమికి సన్నాహాలు?

### విజయ్? నాయకత్వంలో ఏర్పాటుకు సిద్ధం

చెన్నై : తమిళనాడులో కొత్త రాజకీయాల్లో కీలక పరిణామం జరిగింది. తమిళగ వెట్రి కళగం (టీవీకే) నేతృత్వంలోని కొత్త కూటమి ఆవిర్భవించింది. దానికి "సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్" అని పేరు పెట్టారు. చెన్నైలోని పనైయూర్‌లో ఉన్న పార్టీ ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన రెండో కూటమి సమన్వయ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పేరే తమ కూటమి సిద్ధాంతాలను, అజెండాను తెలియజేస్తోందని తమిళనాడు పీసీసీ అధ్యక్షుడు మాణికం ఠాగూర్ తెలిపారు. తమిళనాడు హక్కుల కోసం పోరాడే పార్టీలన్నీ ఈ కూటమిలో ఉన్నాయని ఆయన చెప్పారు. త్వరలో జరిగే ఉపఎన్నికల్లో కూటమి ఉమ్మడిగా పోటీచేస్తుందని మాణికం ఠాగూర్ ప్రకటించారు. లౌకికవాదం, సామాజిక న్యాయం, రాష్ట్ర హక్కుల సాధనే ధ్యేయంగా బరిలోకి దిగనున్న కొత్త కూటమి త్వరలో జరిగే ఉపఎన్నికల్లో సత్తా చాటేందుకు వ్యూహరచన చేస్తోంది. టీవీకే వ్యవస్థాపకుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ అధ్యక్షతన జరిగిన ఈ కీలక సమావేశంలో కాంగ్రెస్, విదుతలై చిరుత్తైగల్ కట్చి (వీసీకే), మరుమలర్చి ద్రవిడ మున్నేట్ర కజగం (ఎండీఎంకే), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐఎంయూఎల్) వంటి కీలక భాగస్వామ్య పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# ఎంపీడీఓ జి.వి.ఎస్.వి.ప్రసాద్

- పుంగనూరు నియోజకవర్గం
- నూతన పెన్షన్ విధి విధానాలు ఖరారు
- సోమల ఎంపీడీవో జి వి ఎస్ పి ప్రసాద్



**సోమల, సెప్టెంబర్ 8 :**

రాష్ట్ర ప్రభుత్వం నూతన పెన్షన్ విధి విధానాలను ఖరారు చేసింది. ఈ నూతన విధానం ప్రకారం అర్హులైన వారు ఈనెల 16వ తేదీ లోపు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు అని ఎంపీడీవో జీవీఎస్వీ ప్రసాద్ తెలిపారు. అర్హత కలిగిన ప్రజలు తమకు సమీపంలోని గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ / వెల్ఫేర్ అసిస్టెంట్ ద్వారా పెన్షన్ దరఖాస్తును నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తు నమోదు చేసిన అనంతరం, పెన్షన్ అప్లికేషన్ నమోదు చేసినట్లు తప్పనిసరిగా రసీదు ఉండాలన్నారు. సోమల మండల పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ, పెన్షన్ దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే అర్హులైన ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించి, ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాము ఆయన కోరారు.

Owned By : PULAMBETI RAGHAVENDRA KUMAR, SULLURPETA-524121, TIRUPATIDistrict,, A.P, Editor At : PULAMBETI RAGHAVENDRA KUMAR, SULLURPETA-524121,TIRUPATIDistrict,, A.P,
Published: PULAMBETI RAGHAVENDRA KUMAR, SULLURPETA-524121,TIRUPATIDistrict, A.P, Mobil No: 8309210219, Printed By :PHANITHA RAMGRAPHICS & PRINTERS, KAVALI-524201, Nellore District, A.P, Mobile: 9441960993